క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ చంద్రగిరి కాలనీ ఫీడర్, వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ శారదానగర్, ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. చంద్రగిరి కాలనీ, సూర్యనగర్, వినాయకనగర్ బ్లాక్ 3 నుంచి 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రెండు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: చెంగిచర్ల గణేష్‌నగర్ కాలనీలోని డాక్టర్ రమేష్ ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీఎండీ టెస్ట్ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వయో వృద్ధులకు దీర్ఘకాలిక ఎముకలు, నరాలు, కీళ్ల జబ్బులతో బాధపడే వారికి, పక్షవాత బాధితులకు, అస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ బాధితులకు చిన్న వయస్సులోనే కీళ్ల ఎముకల జబ్బులతో బాధపడే వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ కన్సల్టేషన్, బీఎండీ టెస్టులు, అవసరమైన వారికి డిజిటల్ ఎక్స్‌రే, మందులు, ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డాక్టర్ వీణా ప్రియ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సర్జరీ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫోన్: 94408 47280, 82972 88064.

డిప్యూటేషన్‌పై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బదిలీ


రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కోట వెంకటేశ్వర్లు డిప్యూటేషన్‌పై ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈమేరకు ఆర్‌డీఎంఏ హైదరాబాద్ రీజియన్ వారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ వాణిరెడ్డి శుక్రవారం ఆయనను రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతం నిర్వహించి ప్రజల మన్ననలు పొందారన్నారు. మేనేజర్ మంజులత, డీఈఈలు శారద, శ్రీలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

కృతజ్ఞతలు



మేడిపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు రూ.లక్ష కేటాయించి కులవృత్తులను అభివృద్ధి చేసేందుకు పథకం ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రణాళిక సంఘం చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మల సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు.

ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం..

అల్వాల్: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలని జీహెచ్‌ఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం అల్వాల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు, కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రీతి, మహేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కుషాయిగూడ: ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో పట్టుబడ్డ నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మల్కాజిగిరి కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు శుక్రవారం పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈశ్వరపురి, సైనిక్‌పురిలో ఆన్‌లైన్ వ్యభిచారం నిర్వహిస్తున్నారంటూ 2021 మార్చి 17న పోలీసులకు సమాచారం అందింది. అప్పటి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీక్రెట్ ఆపరేషన్ నిర్వహించి నిర్వాహకుడు మట్టూరి వంశీకృష్ణతో పాటు వ్యభిచారానికి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం మల్కాజిగిరి కోర్టు నిందితుడికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు చాలా.. నిర్లక్ష్యమేలా..?

- ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు
- పలుచోట్ల తూతూ మంత్రంగా పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీలవాసులు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్, ఇందిరానగర్‌తో పాటు అనేక వీధుల్లో తాగునీటి సరఫరాలో జల కాలుష్యంతో రావడం, చిన్న చెరువులో చెత్తాచెదారం, మురుగు నీరుతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నిధులు మంజూరైనా డీమార్ట్ ఇందిరానగర్ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల సీఎం కేసీఆర్ పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారని, ఆ ప్రకారం పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీల కమిటీలతో పాటు ఆయా కాలనీల వాసులు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు 'సాక్షి' మీకు వివరాలను అందిస్తోంది. మీ సమస్యలను నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయండి.



చిన్న చెరువులో మురుగు

రామంతాపూర్‌లోని పలు కాలనీలు, బస్తీల మధ్య ఉన్న చిన్న చెరువు మురుగు నీరుతో చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజలస్తోంది. దీంతో చెరువు సమీప కాలనీలు, బస్తీల్లో దోమలు తీవ్రంగా విజృంభిస్తున్నాయి. వెంటనే అధికారులు చెరువుపై ప్రత్యేక దృష్టి పెట్టి రోజురోజుకూ పేరుకుపోతున్న చెత్తను ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమస్యపై ప్రశ్నించాలంటే..
- నాగమణి, డీఈ జీహెచ్‌ఎంసీ,
ఫోన్: 79933 60313.

ఇంకెన్నాళ్లు కలుషిత జలాలు



రామంతాపూర్ డివిజన్ పరిధిలో ప్రతిరోజూ తరచూ ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సరఫరా సమయంలో కలుషిత జలాలు వస్తుండంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల స్థానిక గోఖలేనగర్, ఇందిరానగర్‌లో కొన్ని రోజులుగా జలమండలి సరఫరా చేసే తాగునీటిలో బురద ఇతర కాలుష్యంతో కూడిన జలాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే జలమండలి అధికారులు వచ్చి తాత్కాలికంగా పనులు చేస్తుండటంతో మళ్లీ మళ్లీ సమస్య పునరావృతం అవుతోంది. పనులను శాశ్వత ప్రతిపాదికన పూర్తిచేసి కాలుష్యం లేని తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

సమస్యపై ప్రశ్నించాలంటే..
- రజనీకాంత్‌రెడ్డి, జలమండలి డీజీఎం.
ఫోన్: 99899 98204

నిధులు మంజూరైనా పెండింగ్‌లో డిమార్ట్ రోడ్డు

రామంతాపూర్ ప్రధాన రహదారి డీమార్ట్ ఇందిరానగర్ లైన్ రోడ్డుకు అదేవిధంగా ఆసుపత్రి నుంచి ఓల్డ్ రామంతాపూర్ వరకు సీసీ రోడ్లు నిర్మించడానికి రూ.57 లక్షలు మంజూరై సంవత్సరం గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఇంత వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. గుంతలుగా ఉన్న ఈ రోడ్డులో ప్రయాణం నరకంగా మారిందని, అన్ని సౌకర్యాలు ఉన్న కాలనీలోనే రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప మధ్య తరగతి ప్రజలు పేదవారు ఉండే బస్తీల రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని నెహ్రూనగర్, ఇందిరానగర్, శారదానగర్, ఓల్డ్ రామంతాపూర్ సంక్షేమ సంఘం నేతలు కోరుతున్నారు.

- నాగేందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
జీహెచ్‌ఎంసీ, ఫోన్: 99989 930401



ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రామంతాపూర్ నెహ్రూనగర్ ప్రధాన రహదారిలో రాధాదేవి అపార్టుమెంట్ ప్రహరీని ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చిన్నారుల చేతికందే ఎత్తులో దిమ్మెపై ఏర్పాటు చేశారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు దిమ్మెపై ఏర్పాటు చేసి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని అపార్టుమెంట్ వాసులు కోరుతున్నారు.

- రాములు, అసిస్టెంట్ ఇంజనీర్,
విద్యుత్ సబ్ స్టేషన్, రామంతాపూర్.
ఫోన్: 94408 13177



విత్తనాల కంపెనీలో తనిఖీలు


విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ అధికారులు

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని ఎల్డోరదో అగ్రిటెక్ విత్తనాల తయారీ కంపెనీలో శుక్రవారం అగ్రికల్చర్ అధికారి సుధారాణి ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విత్తనాల గ్రేడింగ్, క్వాలిటీ, ప్యాకింగ్, డిస్పాచ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తనాల తయారీ ఉందని అగ్రికల్చర్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నాచారం ఇన్‌స్పెక్టర్ సందీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ సారంగపాణి, ఎండీ లింగా శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారం అభివృద్ధికి కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కొకూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను దత్తత తీసుకోవాలి


మాట్లాడుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: వీధి కుక్కలను దత్తత తీసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో వీధి కుక్కల సంరక్షణ, దత్తతపై అధికారులు, జిల్లా జంతు సంరక్షణ బోర్డు సభ్యులు ఎన్జీవో ప్రతినిధులతో మేయర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం కావడంతో ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను వీధి కుక్కలకు అందించాలని సూచించారు. నీటితొట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి 10శాతం కుక్కలు వలస వస్తున్నాయని, సకాలంలో కుక్కలను పట్టుకోవాలని సూచించారు. కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణ, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, జంతు సంరక్షణ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో చర్లపల్లి

రూ.1.62 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే


చర్లపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని వుకట్‌నగర్‌లో రూ.65 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులు, ఈసీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులు, వీఎన్‌రెడ్డినగర్‌లో రూ.33 లక్షలతో ఆర్‌సీసీ పైప్‌లైన్, భాగ్యనగర్‌లో రూ.64 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బంగారు తెలంగాణ సాధన దిశగా ముందుకు సాగుతున్న సీఎంకు బాసటగా నిలిచి తిరిగి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు సతీష్, రోహిత్, హరిలాల్, స్వరూప, ఎస్‌ఐ ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, గిరిబాబు, అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, జొండ్ల సత్తిరెడ్డి, కోలా నరేష్, ఎం కిర్యాల నర్సింహ, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి


చిలుకానగర్‌లో మాట్లాడుతున్న పరమేశ్వర్

ఉప్పల్: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఉప్పల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తేదీలతో సంబంధం లేకుండా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ మేరకు చిలుకానగర్ డివిజన్ బూత్‌స్థాయి కమిటీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు, నేతలు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి మేకల శివారెడ్డి మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కొంపల్లి బాలరాజ్, బొట్టు రాజేష్, ఆగంరెడ్డి, మంచాల రఘు, కంది శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యకు సత్వర పరిష్కారం


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో మాజీ మేయర్, చర్లపల్లి గౌడసంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న గౌడ సంఘం స్థల సమస్యకు సత్వర పరిష్కారం లభించేలా చూస్తానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గౌడ సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. గౌడసంఘం స్థల సమస్యను మాజీ మేయర్ బొంతు రాంమోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవచూపి గౌడసంఘం ప్రతినిధులతో కలిసి మంత్రిని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈత, తాటి వనం పెంచేందుకు కేటాయించిన 5 ఎకరాల స్థలంలో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు మంత్రికి తెలియజేశారు. తాను మేయర్ ఉన్న సమయంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించి హద్దులు ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించారు. తాజాగా తిరిగి డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సమస్యలు సృష్టిస్తున్నారంటూ మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, గౌడసంఘం ప్రతినిధులు బొడిగె ప్రభుగౌడ్, రుద్రగోని రాంచందర్‌గౌడ్, ఆనంద్‌రాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జైలుకెళ్లినా మారని దొంగబుద్ధి

- జల్సాల కోసం బైక్ దొంగతనాలు
- పోలీసులకు పట్టుబడ్డ బైక్ దొంగ అరెస్టు
- 3.60 లక్షల విలువైన రెండు బైక్‌లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

కుషాయిగూడ: పలు దొంగతనాల కేసులో జైలుకెళ్లి వచ్చినా దొంగ బుద్ధి మారలేదు. జల్సాల కోసం ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లను చోరీ చేస్తూ దర్జాగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అతడి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరాల మేరకు.. కామారెడ్డి బాన్సువాడకు చెందిన మొట్టూరి ప్రమోద్ అలియాస్ ప్రమోద్‌రెడ్డిని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయడంతో వ్యసనాలకు అలవాటుపడ్డాడు. తల్లిదండ్రులకు దూరంగ బోడుప్పల్ బొల్లిగూడలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీలు చేస్తున్నాడు. ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లను రాత్రివేళ చోరీ చేస్తున్నాడు. బైక్‌లను ఇంట్లో ఉంచి స్పేర్స్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించి వచ్చినా తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం నేతాజీనగర్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. జనగాం, ఘట్‌కేసర్, ఎల్‌బీనగర్‌లో ఒక్కో కేసు ఉండగా కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన వెంట ఎస్‌ఐ మదన్‌లాల్, సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


ఉప్పల్ జీహెచ్‌ఎంసీ నుంచి అవగాహన ర్యాలీ

ఉప్పల్: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయ ఆవరణ నుంచి 'మేరి లైఫ్ మేరా స్వచ్ఛ్ షహర్' అనే నినాదంతో సర్కిల్ శానిటేషన్ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, సింగల్ యూస్ ప్లాస్టిక్, నిరుపయోగమైన ప్లాస్టిక్ వాడకూడదని, ఇతర వ్యర్థాలను రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానాలను అవలంబించాలని కోరారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. త్వరలో డివిజన్‌కు ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఈ కేంద్రాల్లో నిరుపయోగ వస్తువులను అందివ్వొచ్చన్నారు. కార్యక్రమంలో డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్,దిలీప్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అందించాలి


ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మల్కాజిగిరి: ప్రభుత్వాలు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించలేవని, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శిక్షా పాత్ర టీమ్‌సాయి పేరుతో చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులు 325 మందికి టాబ్స్, డిజిటల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా పరిస్థితుల్లో ఆన్‌లైన్ ద్వారా పాఠాలు వినే రోజులు వచ్చాయని, టాబ్స్, మొబైల్స్ లేక పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. పేదవిద్యార్థులకు అండగా నిలబడేందుకు ముందుండాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు టీంసాయి మాట్లాడుతూ శిక్షా పాత్ర పేరిట కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రారంభించి మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాంతాల్లోని విద్యార్థులకు అందజేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఆర్మీ అధికారులు మేజర్ సుబేదార్ పీఎస్ఎన్ స్వామి, డి.కె.సింగ్, ఇతర ప్రముఖులు నిర్మల, వనితారేఖ, రవీంద్రనాథ్ ఠాగూర్, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, నాయకులు హరీష్ రెడ్డి, వి.కె.మహేష్, బాలచందర్‌గౌడ్, శివకుమార్, సదానంద్‌గౌడ్, రవియాదవ్ పాల్గొన్నారు.

మేడిపల్లి సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

మేడిపల్లి: తప్పుడు సర్వేలతో ప్రజలు, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న మేడిపల్లి సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే నంబర్ 62లో 116 ఎకరాలు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అసైన్డ్ భూమి ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం లాండ్‌పూలింగ్ కింద అసైన్డ్ భూములను తీసుకొని భూమిపై అధికారం కలిగిన బాధితులకు ఎకరానికి 600 గజాలు ఇచ్చి అభివృద్ధి చేస్తోంది. సర్వే నంబర్ 62లో రాష్ట్ర ప్రభుత్వం రాచకొండ కమిషనరేట్ బిల్డింగ్ అవసరానికి 56 ఎకరాల భూమిని కేటాయించి మిగతా 60 ఎకరాలు హెచ్‌ఎండీఏతో డెవలప్ చేస్తోందని తెలిపారు. అయితే ఈ భూమిని ఆనుకొని ఉండటంతో అసైన్డ్ భూమి సర్వే నంబర్ 62లోని భూమిని ఆక్రమించి ప్రైవేటు సర్వే నంబర్ 78, 79, 80లో సుమారుగా 800 గజాలు, సర్వే నంబర్ 74లో 2,800 గజాలు, సర్వే నెంబర్-10లో 2,600 గజాలకు దొంగ పట్టాలను సృష్టించి కబ్జాలకు పాల్పడ్డారని వాపోయారు. ఇష్టానుసారంగా సర్వే చేయడం వల్ల కబ్జాదారులకు లాభం కలిగిందని మేడిపల్లి రైతులు తెలిపారు. కబ్జాల నుంచి తమ భూమిని కాపాడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.